# ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది: 31.01.2026** **సమయం: 13.10 గంటలు**

## ముఖ్యాంశాలు

1. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వరసగా తొమ్మిదోసారి రేపు పార్లమెంట్ లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.
2. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు 28 వేల 456 నామినేషన్లు దాఖలయ్యాయి.
3. మేడారం మహాజాతర ఈ రోజు సమ్మక్క వన ప్రవేశం ఘట్టంతో ముగియనుంది.
4. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గత బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిని కొనసాగిస్తోందని భారతీయ జనతా పార్టీ ఆరోపించింది.

…………………………………………………………………………

**నిర్మలా సీతారామన్**

2026–27 కేంద్ర బడ్జెట్ స్కాన్ కాపీ లీక్ అయిందన్న సోషల్ మీడియా ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఇది నకిలీ వార్త అని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2019లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వరసగా తొమ్మిదోసారి రేపు పార్లమెంట్ లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం పూర్తయ్యాక బడ్జెట్‌కు సంబంధించిన పత్రాలు మొబైల్ యాప్‌తో పాటు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి రానున్నాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం దేశంలోని

వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు ముప్పై మంది కళాశాల విద్యార్థులతో ఆర్థిక మంత్రి ముఖాముఖి చర్చ నిర్వహించనున్నారు.

..........NSD

**గద్దర్ జయంతి**

తెలంగాణ ఉద్యమకారులు గద్దర్ పాటలు, ఆలోచనలు, పోరాటస్ఫూర్తి ప్రజల మధ్య శాశ్వతంగా జీవిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రోజు గద్దర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనకు నివాళులర్పించారు. గద్దర్ జయంతిని తమ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, ఆయన పేరుతో అవార్డును నెలకొల్పి ప్రతి ఏటా కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు ప్రదానం చేయాలని నిర్ణయించిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. 1949 జనవరి 31న అప్పటి మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలో ఒక పేద కుటుంబంలో జన్మించిన గద్దర్ తన జీవితాన్ని ప్రజల పాటగా, పోరాట స్వరంగా మలిచారు. 2023 ఆగస్టు 6న ఆయన తుది శ్వాస విడిచారు.

......డెస్క్

**మున్సిపల్ ఎన్నికలు**

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల నేపథ్యంలో నిన్నటితో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. మొత్తం 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు కలిపి 28 వేల 456 నామినేషన్లు దాఖలయ్యాయి. వచ్చే నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది.

గద్వాల జిల్లాలో గద్వాల, ఐజ, వడ్డేపల్లి, అల్లంపూర్ మున్సిపాలిటీల్లో మొత్తం 525 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు భారీగా నామినేషన్లు రావడంతో రాజకీయ పార్టీల మధ్య పోటీ తీవ్రంగా కనిపించింది.

ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్‌లో 20 వార్డులకు 166, కాగజ్‌నగర్‌లో 30 వార్డులకు 230 నామినేషన్లు దాఖలయ్యాయి.

నిర్మల్ జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లోని 80 వార్డులకు 629 నామినేషన్లు వచ్చాయి. సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో 256 వార్డులకు మొత్తం 2 వేల 293 నామినేషన్లు దాఖలయ్యాయి. భారీ సంఖ్యలో అభ్యర్థులు బరిలోకి దిగడంతో ఎన్నికల వాతావరణం ఉత్కంఠగా మారింది.

జనగామ, స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీల్లో కలిపి 48 వార్డులకు మూడు రోజుల్లో 475 నామినేషన్లు దాఖలయ్యాయి.

మంచిర్యాల జిల్లాలో మొత్తం 1,599 నామినేషన్లు దాఖలయ్యాయి. మంచిర్యాల కార్పొరేషన్‌తో పాటు బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షటిపేట మున్సిపాలిటీల్లో అన్ని వార్డుల్లో పోటీ నెలకొంది.

ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లోని 117 వార్డులకు మూడురోజుల్లో మొత్తం 779 మంది అభ్యర్థులు 923 నామినేషన్లు దాఖలు చేశారు. వాటిలో నిన్న ఒక్కరోజే 603 నామినేషన్లు అందినట్లు అధికారులు చెప్పారు.

కరీంనగర్ నగర పాలక సంస్థ తో పాటు జమ్మికుంట, చొప్పదండి, హుజురాబాద్ పురపాలక సంఘాలకు చివరి రోజు భారీగా నామినేషన్ లు దాఖలు అయ్యాయి.

పురపాలక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఎన్నికల ఖర్చుల నియంత్రణపై చర్చించారు. ఒక్కో అభ్యర్థి లక్ష రూపాయలకంటే ఎక్కువ ఖర్చు చేయరాదని, ఖర్చుల వివరాలు అధికారులకు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

..........ALL PTCs

**సీఎం మున్సిపల్ ఎన్నికలు**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 శాతం స్థానాలు కైవసం చేసుకునేలా వ్యూహాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల వ్యూహాలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఏర్పాటు చేసిన జూమ్

మీటింగ్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచి సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల సర్వే నివేదికను మహేశ్ కుమార్ గౌడ్ వివరించిన తర్వాత ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రెబల్స్ బెడద లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉపఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ.. నాయకులంతా సమష్టిగా పనిచేస్తేనే విజయం సాధ్యమనీ సూచనలు చేశారు. మేయర్, ఛైర్మన్ అభ్యర్థులను ఇప్పుడే ప్రకటించవద్దని, సామాజిక సమీకరణాల ఆధారంగానే ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాల ఇన్ ఛార్జ్ మంత్రులు, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. కాగా ఫిబ్రవరి 3 నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

పిటిసి, హైదరాబాద్ –డెస్క్

**జీహెచ్ఎంసీ**

గ్రేటర్ హైదరాబాద్ నగరానికి సంబంధించి 11 వేల 460 కోట్ల రూపాయిలతో రూపొందించిన బడ్జెట్ పై ఈ రోజు జీహెచ్ఎంసీ ప్రత్యేక పాలక మండలి సమావేశంలో చర్చిస్తోంది. అభివృద్ధి పనులకు జరిపిన కేటాయింపులు, ఆదాయ వ్యయాలపై కార్పొరేటర్లు చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... గడచిన ఐదేళ్ళలో నగర అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. ఈ చివరి సమావేశం భావోద్వేగంతో కూడుకున్నదని అన్నారు. ఫిబ్రవరి 10న కార్పొరేటర్ల పదవీకాలం పూర్తికానున్న నేపథ్యంలో వారికి ఇదే చివరి సమావేశం. కాగా, ఇటీవల చేపట్టిన డివిజనల్ల పునర్విభజనతో గ్రేటర్ హైదరాబాద్ పరిధి 300 డివిజన్లకు పెరిగింది.

.........డెస్క్

**కోఠి దుండగులు**

హైదరాబాద్ -కోఠి ఎస్బీఐ కార్యాలయం ఏటీఎం వద్ద ఈ ఉదయం కాల్పులు జరిపి ఒక వ్యక్తి నుంచి ఆరు లక్షల రూపాయిలు దోపిడీ చేసిన నిందితుల కోసం ఐదు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు డీసీపీ శిల్పవల్లి చెప్పారు. నాంపల్లికి చెందిన వస్త్ర వ్యాపారి రషీద్ ఉదయం

7 గంటలకు ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎంలో నగదు డిపాజిట్ చేసేందుకు ఒక బ్యాగ్‌తో వచ్చారు. డబ్బులతో రావడం గమనించిన కొందరు దుండగులు, అతని చేతిలోని బ్యాగును లాక్కెళ్లడానికి ప్రయత్నించారు. రషీద్ ప్రతిఘటించడంతో అతనిపై కాల్పులు జరిపి డబ్బుల బ్యాగ్ ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో రషీద్ కాలికి బుల్లెట్ గాయమైంది. క్లూస్ టీమ్స్ ఇప్పటికే ప్రాథమిక వివరాలు సేకరించాయని, నిందితులు తప్పించుకోలేరని డీసీపీ శిల్పవల్లి పేర్కొన్నారు.

………..డెస్క్

**మేడారం**

మేడారం మహా జాతర నాలుగో రోజు వైభవంగా సాగుతోంది. ఈ రోజు సమ్మక్క వన ప్రవేశం ఘట్టంతో ఈ జాతర ముగియనుంది. సాయంత్రం 4 గంటల తర్వాత ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సమ్మక్క- సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులు గద్దెలపై కొలువుదీరి ఉండడంతో భక్తులు భారీ సంఖ్యలో మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాగా, ఈ గత మూడు రోజుల్లో 80 లక్షల మంది భక్తులు మేడారం వచ్చి ఉంటారని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ జాతర కోసం పసరా నుంచి తాడ్వాయి మీదుగా మేడారం చేరుకునే అడవి మార్గంలో నిన్న రాత్రి నుంచి ట్రాఫిక్ జామ్ కొనసాగుతుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

………..డెస్క్

**బీజేపీ**

కాంగ్రెస్ పార్టీ  గత బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిని కొనసాగిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్ లో ఈ రోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీలో అసలు పరిపాలనే లేదని విమర్శించారు. ఎల్ ఆర్ ఎస్ విషయంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

ఉద్యోగ నియామకాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, ఇందిరమ్మ ఇల్లు, రైతుభరోసా పథకాలపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, అవినీతి రహిత పాలన కోసం మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

......డెస్క్,

**మేఘారెడ్డి**

రెండేళ్లు ప్రజా ప్రభుత్వం పాలనకు ప్రజలు సమ్మతి తెలిపుతున్నారని వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి తెలిపారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి ఈ ఉదయం వనపర్తిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ,ఎన్నికల ప్రచారాన్నిమొదలుపెట్టారు. పట్టణాలను అభివృద్ధి బాటలో నడిపేందుకు ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

...........పిటిసి

**టీటీడీ**

తిరుమలలో విక్రయించే శ్రీవారి బంగారం, వెండి డాలర్ల అమ్మకాలను తిరుమల తిరుపతి దేవస్థానం తాత్కాలికంగా నిలిపివేసింది.బంగారం హెచ్చు తగ్గుల నేపథ్యంలో బయట మార్కెట్ ధరలతో పోలిస్తే టీటీడీ డాలర్ల ధరలు తక్కువగా ఉండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు భక్తులు భారీగా రావడంతో నిన్న మధ్యాహ్నం నుంచి విక్రయ కౌంటర్‌ను మూసివేశారు. విక్రయ పద్ధతుల్లో మార్పులు చేపట్టిన తర్వాత కొత్త విధానంలో డాలర్ల విక్రయాలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

.........డెస్క్

**వనపర్తి జిల్లా**

వనపర్తి జిల్లా కొత్తకోట బీసీ వసతి గృహంలో నిన్న రాత్రి భోజనం తర్వాత 15 మంది విద్యార్థినీలు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించగా,

వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఎమ్మెల్యేలు మెగా రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆస్పత్రిలో విద్యార్థినీలను పరామర్శించారు.

.........పీటీసీ, వనపర్తి

**ఆసిఫాబాద్**

అసిఫాబాద్ సమీపంలోని ఇటుక బట్టీలో నిర్బంధ శ్రమ దోపిడీకి గురవుతున్న ముగ్గురు మహిళలను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ రక్షించారు. సమాచారం అందిన వెంటనే అధికారులు ఒడిశాకు చెందిన మూడు నెలల బాలింతతో పాటు మరో ఇద్దరు మహిళలను రక్షించి, సఖి కేంద్రానికి తరలించారు. యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని జడ్జి ఈ సందర్భంగా హెచ్చరించారు.

.......పీటీసీ, ఆసిఫాబాద్

**ఎప్ సెట్**

రాష్ట్రంలోని బీటెక్, బీ-ఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎప్ సెట్ దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 19న ప్రారంభం అవుతుందని ఉన్నత విద్యా మండలి తెలియజేసింది. ఎంటెక్, ఎం-ఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పీజీ ఈసెట్ కు ఫిబ్రవరి 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుంది.

.............డెస్క్